# విధ్వంసంపై ఏకరువు!

## కంచ గచ్చిబౌలిలో కేంద్ర కమిటీ పర్యటన • చెట్లు నరికిన ప్రాంతంలో బృందం పరిశీలన

- తమతో కలిసి పరిశీలించాలన్న విద్యార్థుల అభ్యర్థనకు అధికారుల అనుమతి నిరాకరణ
- ఉదయం నుంచి వరుస సమావేశాలతో బిజీ
- విద్యార్థులు, యూనివర్సిటీ జేఏసీ, రాజకీయ పార్టీలతో కమిటీ భేటీ.. నివేదికల స్వీకరణ
- ఎంసీఆర్ హెచ్ఆర్డీలో విద్యార్థులతో సమావేశం
- హరీశ్ నేతృత్వంలో 200 పేజీల డాక్యుమెంట్లు, ఫొటోలు అందించిన బీఆర్ఎస్ ప్రతినిధులు

గురువారం హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ భూములను పరిశీలిస్తున్న 'సుప్రీం కోర్టు' కమిటీ సభ్యుల బృందం

హైదరాబాద్/ హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ) : అరుదైన జీవవైవిధ్యానికి నిలయమైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల్లో జరిగిన విధ్వంసంపై సుప్రీం కోర్టు నియమించిన కేంద్ర సాధికార కమిటీ క్షేత్రస్థాయి అధ్యయనం మొదలుపెట్టింది. వర్సిటీ పరిధిలోని 400 ఎకరాల అటవీభూముల్లో చెట్లను నరికిన ప్రాంతానికి కమిటీ చైర్మన్ సిద్ధాంత్ దాస్ నేతృత్వంలో సభ్యులు చంద్రప్రకాశ్ గోయల్, సునీల్ లిమయే, చంద్రదత్, పర్యావరణ, అటవీశాఖ నిపుణులు, రాష్ట్ర స్థాయి అధికారులు, సైబరాబాద్ సీపీ మహంతితో కలిసి ఉదయం 10.30 గంటలకు చేరుకున్నారు. కమిటీ సభ్యులను అధికారులు, పోలీసులు వర్సిటీ ఈస్ట్ క్యాంపస్ వెనుక గేట్ నుంచి లోపలికి తీసుకొచ్చారు. ఐదు రోజుల పాటు కాంగ్రెస్ సర్కారు చెట్లను నరికి, చదును చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. చెట్లు నరికిన ప్రాంతాన్ని అధికారులకు చూపించేందుకు తమను అనుమతించాలని విద్యార్థులు కోరినా శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందనే నెపంతో పోలీసులు అనుమతించలేదు. ఈస్ట్ క్యాంపస్ ప్రాంతంలో సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ సభ్యులు గంట పాటు కలియదిరిగారు. అనంతరం క్షేత్రస్థాయి సిబ్బంది, పర్యావరణ, అటవీ శాఖ అధికారులతో కలిసి యూనివర్సిటీ పరిధిలో ఉన్న మొత్తం భూముల విస్తీర్ణం, జీవవైవిధ్యం, పర్యావరణ పరిస్థితులు, వన్యప్రాణులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థి జేఏసీ నేతలు అక్కడ కలుస్తామని చెప్పగా వద్దన్నారు. జేఏసీతో నేతలతో మాట్లాడేందుకు తమకెలాంటి అభ్యంతరం లేదని, అయితే, జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీహెచ్ఆర్డీ)లో మాట్లాడుతామని చెప్పారు.

### డాక్యుమెంట్లు, ఫొటోలు అందించిన బీఆర్ఎస్

**విద్యార్థులతో** భేటీ అనంతరం మధ్యాహ్నం 2గంటలకు కమిటీ బంజారాహిల్స్‌లోని హోటల్ తాజ్ కృష్ణాకు చేరుకున్నది. అక్కడ కొద్దిసేపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో సభ్యులు మాట్లాడారు. అనంతరం మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రతినిధి బృందంతో సుమారు అరగంటకుపైగా కమిటీ భేటీ అయింది. హెచ్‌సీయూ భూములకు సంబంధించి, జరిగిన విధ్వంసం గురించి 200 పేజీల కీలక డాక్యుమెంట్లు, ఫొటోలను బీఆర్ఎస్ ప్రతినిధులు కమిటీకి అందించారు. అవి హెచ్‌సీయూ భూములేనని, అటవీ చట్టాల ప్రకారం అక్కడ చెట్లు నరకడం నేరమని, గతంలో ఈ తరహా వివాదాల్లో సుప్రీంకోర్టుతో పాటు పలు న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పు కాపీలను కూడా అందజేశారు.

**దాష్టీకంపై పూసగుచ్చినట్టు..**

హెచ్‌సీయూ జేఏసీ నుంచి ఐదుగురు విద్యార్థులు, ఏబీవీపీ నుంచి మరో ఐదుగురు విద్యార్థులతో కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. 400 ఎకరాల్లో కాంగ్రెస్ సర్కారు చేసిన విధ్వంసంపై గంట పాటు విద్యార్థుల నుంచి ఆరా తీశారు. వర్సిటీలో చెట్ల నరికివేత, జీవ వైవిధ్యం, పర్యావరణం వంటి అంశాలపై విద్యార్థుల అభిప్రాయాలను, మౌఖిక, లిఖిత పూర్వకంగా తీసుకున్నారు. ఈ క్రమంలో విద్యార్థి జేఏసీ బృందం కమిటీ ముందుకు పలు కీలక అంశాలను తీసుకొచ్చినట్టు తెలిసింది. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడంతో పాటు చెట్లు నరికిన ప్రాంతంలో ఉన్న జీవజాలం గురించి అన్ని వివరాలతో నివేదిక రూపంలో అందించారు. అక్కడి చెట్లు, జంతువులు, అరుదైన జీవజాతుల ప్రాముఖ్యతపై వివరించినట్టు విద్యార్థులు తెలిపారు. తమ విన్నపాలను మెయిల్ రూపంలో అధికారికంగా అంజేయాలని కమిటీ సభ్యులు చెప్పినట్టు వివరించారు. తమతో కలిసి మరోసారి 400 ఎకరాల ప్రాంతంలో తిరిగేందుకు అవకాశం కల్పించేందుకు సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు. ప్రభుత్వం విధ్వంసం సృష్టించిన ప్రాంతంలో ఉన్న పీకాక్ లేక్, బఫెల్లో లేక్, మష్రూమ్ రాక్స్, జంతువులు, పక్షులను చూసేందుకు మళ్లీ పర్యటించాలని కోరినట్టు తెలిపారు.

**హెచ్‌సీయూ పాలక మండలితో భేటీ**

బీఆర్ఎస్ బృందంతో సమావేశం అనంతరం హెచ్‌సీయూ పాలక మండలితో సాధికార కమిటీ సమావేశమైంది. వీసీ, రిజిస్ట్రార్‌తో పాటు పలువురు హెచ్‌వోడీలు సమావేశంలో పాల్గొని వర్సిటీ తరపున పలు సాక్ష్యాలను, కాగితాలను అందజేశారు. అక్కడ జీవజాలం ఉన్నదని, చెట్లు ఉన్నాయని స్పష్టంగా చెప్పారు. అనంతరం బీజేపీ ప్రతినిధుల బృందం కమిటీని కలిసింది. ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు మాట్లాడుతూ 150 ఎకరాల్లో రాత్రికిరాత్రే చెట్లను నరికివేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలతో సమావేశం తర్వాత కమిటీ సభ్యులు ప్రభుత్వ అధికారులతో భేటీ అయి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, సైబరాబాద్ సీపీ అవినాశ్ మోహంతి, కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**కీలక సమాచారం సేకరణ.. మరోసారి పర్యటన**

క్షేత్రస్థాయి పర్యటనలో సాధికార కమిటీ కీలక సమాచారం సేకరించినట్టు తెలిసింది. జీవవైవిధ్యంపై కాంగ్రెస్ సర్కారు చేసిన దౌర్జన్యం, జీవావరణాన్ని దెబ్బతీసేలా వృక్ష సంపద, వన్యప్రాణులపై జరిగిన విధ్వంసం, విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యం, బనాయించిన అక్రమ కేసులు వంటి విషయాలన్నీ సేకరించినట్టు సమాచారం. తొలి రోజు విద్యార్థులతో భేటీ కాగా నేడు పర్యావరణ, అటవీ శాఖ నిపుణులతో సమావేశమయ్యే అవకాశమున్నదని తెలిసింది. పలు దఫాల సమావేశాల తర్వాత నివేదికను సుప్రీంకోర్టుకు అందజేస్తామని కమిటీ సభ్యులు వివరించారు. గురువారం జరిపింది ప్రాథమిక విచారణ మాత్రమేనని, ఈ నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పిస్తామని, త్వరలోనే మరోసారి హెచ్‌సీయూలో తమ పర్యటన ఉంటుందని కమిటీ స్పష్టం చేసినట్టు సమాచారం.

### పరిశీలనలో విద్యార్థులకు అనుమతి నిరాకరణ

**కాంగ్రెస్** సర్కారు చెట్లు నరికిన ప్రాంతాన్ని కమిటీ సభ్యులకు తామే స్వయంగా చూపించేందుకు అనుమతివ్వాలని విద్యార్థులు కోరారు. తమకు కాంగ్రెస్ సర్కారు, పోలీసులపై నమ్మకం లేదని.. కమిటీ సభ్యులకు విధ్వంసం జరిగిన ప్రాంతం మొత్తాన్ని చూపించరని అనుమానం వ్యక్తంచేశారు. తమతో కలిసి మరోసారి యూనివర్సిటీలో కమిటీ పర్యటించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. కాగా క్యాంపస్‌లో గంటకుపైగా గడిపిన కమిటీ సభ్యులు అక్కడి నుంచి నేరుగా మధ్యాహ్నం 12 గంటలకు ఎంసీహెచ్ఆర్డీకి చేరుకున్నారు. అక్కడ విద్యార్థులు, విద్యార్థి జేఏసీ ప్రతినిధులతో మాట్లాడారు.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ముందు నినదిస్తున్న విద్యార్థులు

రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం మామిడిపల్లిలోని భూములు

# సర్కారు తాజా టార్గెట్ మామిడిపల్లి ల్యాండ్స్!

- 468 ఎకరాలను స్వాధీనం చేసుకుని చుట్టూ ఫెన్సింగ్
- తహసీల్దార్ నుంచి రికార్డులు తెప్పించుకుంటున్న అధికారులు
- భూ బదలాయింపు జరగకముందే బోర్డులు పాతిన టీజీఐఐసీ
- సర్కారు తాకట్టు పెడుతుందా? వేలం వేస్తుందా?

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/బడంగ్‌పేట, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): భూముల అమ్మకం.. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎంచుకున్న కీలకమైన టాస్క్ ఇది. హెచ్‌సీయూ భూములను తాకట్టు పెడితేనే రూ.10 వేల కోట్లు రావడంతో, వాటిని అమ్మేస్తే అంతకంటే ఎక్కువ వస్తుందని ప్రభుత్వం ఆశించింది. కానీ, అనూహ్యంగా సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు ఆందోళనకు దిగడం, వారికి తెలంగాణ సమాజంతోపాటు దేశవ్యాప్తంగా పర్యావరణ వేత్తలు కూడా మద్దతు ఇవ్వడంతో ప్రభుత్వం ఇరకాటంలో పడింది. ప్రస్తుతం బంతి సుప్రీంకోర్టులో ఉన్నందున భూములను అమ్మే దారులు దాదాపు మూసుకుపోయాయని అధికారులే చెప్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి రాష్ట్రంలో 'ఐఎంజీ అకాడమీస్ భారత ప్రైవేట్ లిమిటెడ్' అనే సంస్థకు ఇచ్చిన మరో ల్యాండ్‌బ్యాంక్‌పై ప్రభుత్వం దృష్టిసారించింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల, బాలాపూర్ మండలం మామిడిపల్లి గ్రామాల పరిధిలో విస్తరించి ఉన్న 468 ఎకరాలపై తాజాగా అధికార యంత్రాంగం కసరత్తు మొదలుపెట్టింది.

**చంద్రబాబు హయాంలో కారుచౌకగా..**

ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు చౌకగా వందలాది ఎకరాల భూములను 'ఐఎంజీ అకాడమీస్ భారత ప్రైవేట్ లిమిటెడ్'కు కట్టబెట్టారు. చంద్రబాబు సర్కారు 2003లో కంచ గచ్చిబౌలిలో హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాలతో పాటు ఇదే జిల్లాలోని రావిర్యాల, మామిడిపల్లి పరిధిలోని దాదాపు 468 ఎకరాలను కూడా కట్టబెట్టింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం 2006లో ఆ ఒప్పందాన్ని రద్దు చేయడంతో 'ఐఎంజీ' న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం సైతం ఆ భూముల కోసం కోర్టులో వాదనలు వినిపించడం ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కలిసొచ్చింది. గత ఏడాది మార్చిలో హైకోర్టు ఇచ్చిన తీర్పులో ఆ భూములు సర్కారువేనని స్పష్టంచేయడంతో తొలుత కంచ గచ్చిబౌలి భూములపై సర్కారు దృష్టిసారించింది. తదుపరి పరిణామాల నేపథ్యంలో ఆ భూముల వ్యవహారంపై ఇప్పుడు సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్నది. అంతేకాకుండా తాము అధికారంలోకి రాగానే 400 ఎకరాల్లో ఎకో పార్కు ఏర్పాటు చేస్తామని, రేవంత్ ప్రభుత్వం విక్రయించినా తిరిగి స్వాధీనం చేసుకుంటామని, వాటిని ఎవరూ కొనుగోలు చేయవద్దని కేటీఆర్ పార్టీపరంగా స్పష్టంచేశారు. దీంతో ఆ భూముల వ్యవహారం ఇప్పట్లో తెగేలా లేదనే నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వం వచ్చినట్టు తెలిసింది.

**బోర్డులు పాతిన టీజీఐఐసీ**

'ఐఎంజీ అకాడమీస్ భారత'కు ఇచ్చిన భూములు బాలాపూర్ మండలం మామిడిపల్లి, మహేశ్వరం మండలం రావిర్యాల గ్రామాల్లో విస్తరించి ఉన్నాయి. రావిర్యాలలోని సర్వే నంబర్ 1/1లో 86.34 ఎకరాలు, మామిడిపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 99/1లో 420 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉన్నది. ఇందులో నుంచే చంద్రబాబు ప్రభుత్వం కేటాయింపులు చేసింది. గత ఏడాది మార్చిలో తీర్పు వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భూములపై దృష్టిసారించింది. ఇందులో దాదాపు 200 ఎకరాల భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్నాయి. భారీ పోలీసు బలగాలను మోహరించి వారందరినీ అక్కడి నుంచి ఖాళీ చేయించారు. అయితే, ఇందులో మహారాజ్ రాజాసింగ్ మనవరాలు షాలిని కూడా ఉన్నట్టు తెలిసింది. ఆ భూమి తనదేనంటూ ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించినట్టు స్థానికులు చెప్తున్నారు. కాగా, ప్రభుత్వం ఈ భూములను స్వాధీనం చేసుకున్న తర్వాత టీజీఐఐసీ ఆధ్వర్యంలో చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించింది. అంతేకాకుండా ఆ భూములు టీజీఐఐసీకి చెందినవంటూ బోర్డులు ఏర్పాటుచేసింది. అయితే రికార్డుల్లో మాత్రం ఆ భూమి హక్కులు రెవెన్యూ శాఖ నుంచి టీజీఐఐసీకి బదలాయింపు జరగలేదని సమాచారం. కంచ గచ్చిబౌలి తర్వాత దీనిపై దృష్టిసారించాలనుకున్న ప్రభుత్వం ఇప్పటివరకు ఈ భూములను పెద్దగా పట్టించుకోలేదు. కానీ కంచ గచ్చిబౌలిలో పరిస్థితి ప్రతికూలంగా మారడంతో గత రెండు, మూడు రోజులుగా ఇక్కడ కదలిక మొదలైంది. ఈ భూములకు సంబంధించిన రికార్డులన్నింటినీ పంపాల్సిందిగా ఇప్పటికే జిల్లా అధికారుల నుంచి మండల రెవెన్యూ అధికారులకు ఆదేశాలు వెళ్లాయి. ఈ భూ రికార్డులు ఎలా ఉన్నాయి? ప్రైవేటు వ్యక్తుల పేర్లు ఏమైనా ఉన్నాయా? అనే వివరాలపై జిల్లా యంత్రాంగం ఆరా తీస్తున్నది. రికార్డుల పరిశీలన పూర్తయ్యాక అధికారికంగా టీజీఐఐసీకి భూ బదలాయింపు జరిగే అవకాశాలున్నాయి. ఆ తర్వాత ప్రభుత్వం ఈ భూములను తాకట్టు పెడుతుందా? నేరుగా అమ్ముతుందా? అనేది చర్చనీయాంశంగా మారింది.

### పెళ్లయిన కుమార్తెపై 'కారుణ్యం' చూపండి

**రాష్ట్రానికి హైకోర్టు ఆదేశం**

హైదరాబాద్, ఏప్రిల్ 10, (నమస్తే తెలంగాణ): కారుణ్య నియామకంలో పెళ్లయిన కుమార్తె దరఖాస్తును తిరిగి పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. వినతిపత్రంతోపాటు తగిన పత్రాలను ప్రభుత్వానికి తిరిగి సమర్పించాలని పిటిషనర్‌కు సూచించింది. ఏఎస్ఐగా పనిచేసిన తన భర్త మరణించినందున, కారుణ్య నియామకం కింద తన కుమార్తెకు ఉద్యోగం ఇవ్వాలంటూ షాహీన్ సుల్తానా అనే మహిళ ఇచ్చిన వినతిపత్రాన్ని పోలీస్ కమిషనర్ తిరస్కరించారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ షాహీన్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నామాపురపు రాజేశ్వరరావు విచారణ జరిపారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. మృతుడు తనపై ఆధారపడిన వారిలో భార్య పేరు మాత్రమే ఇచ్చారని, పిటిషనర్‌కు ఉద్యోగం చేసే కుమారుడు ఉన్నాడని, ఇద్దరు కుమార్తెలకు వివాహం అయ్యిందని చెప్పారు. అన్ని అంశాలను పరిశీలించాకే పిటిషనర్ దరఖాస్తును అధికారులు తిరస్కరించారని తెలిపారు. పిటిషనర్ తరపు న్యాయవాది మాట్లాడుతూ.. షాహీన్ యోగక్షేమాలు చూస్తున్న కుమార్తె నిరుద్యోగి అని, తల్లి అనారోగ్యానికి తగిన చికిత్స అందించలేకపోతున్నారని చెప్పారు. పెళ్లయినప్పటికీ కారుణ్య నియామకానికి అర్హురాలేనని జార్ఖండ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ఆమోదించిందని గుర్తుచేశారు. వాదనలు విన్న హైకోర్టు, పిటిషనర్ 3 వారాల్లోగా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని, అందులో కుమార్తె భర్త ఆర్థిక పరిస్థితులను కూడా వివరించాలని, దరఖాస్తును అందుకున్న అధికారులు 8 వారాల్లోగా దానిపై చట్ట ప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని తీర్పు చెప్పింది.

### ఎడ్లబండ్ల దారి ప్రజారహదారే:హైకోర్టు

హైదరాబాద్, ఏప్రిల్ 10, (నమస్తే తెలంగాణ): పల్లెల్లో ఎడ్లబండ్లు వెళ్లే దారి ప్రజారహదారే అవుతుందని హైకోర్టు స్పష్టం చేసింది. అలాంటి దారులను ప్రభుత్వ ఆస్తిగానే పరిగణించాలని తెలిపింది. రహదారులు, నడకదారులు, నదులు, చెరువులు, వంతెనలు ప్రభుత్వ ఆస్తులేనని ఆంధ్రప్రదేశ్ (తెలంగాణ ఏరియా) ల్యాండ్ రెవెన్యూ యాక్ట్‌లోని సెక్షన్ 24 పేర్కొంటున్నదని గుర్తుచేసింది. సరిహద్దుల చట్టంలోని నిబంధనల ప్రకారం పాత రికార్డుల్లో బండ్ల దారి ఉంటే, పది అడుగులు లేదా 3.04 మీటర్ల దారి వదలాల్సిందేనని చెప్పింది. బండ్ల దారిని ఆక్రమించారని సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం కోడూరు గ్రామస్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ టీ మాధవీదేవి విచారించారు. పాత్ అనే పదాన్ని దారి అని పేర్కొనవచ్చని, బండ్ల దారి వెళ్లే భూమి ఎవరిదైతే వారికి 10 ఫీట్ల భూమి ఇవ్వాలని, బండ్లదారి ఆక్రమణకు గురైతే తొలగించే అధికారం కార్యదర్శికి ఉండదని, ఆ బాధ్యత రెవెన్యూ అధికారులదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### ఇసుక బజార్లలో మట్టి ఇసుక!

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఇసుక బజార్లలో మట్టితో కూడిన ఇసుక కావడంతో ఆ ఇసుకతో కూడిన నిర్మాణాలు ఏ మేరకు సురక్షితమో చెప్పలేమని నిర్మాణరంగ నిపుణులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ఈ ఇసుకను నల్లగొండ జిల్లా పరిధిలోని మూసీ నది నుంచి తీసుకొస్తున్నట్టు పలువురు ఇసుక రవాణాదారులు చెప్తున్నారు. కాళేశ్వరం నుంచి వచ్చే గోదావరి ఇసుకతో సమానంగా మూసీ ఇసుక ధరను నిర్ధారించడం విమర్శలకు తావిస్తున్నది. హైదరాబాద్ శివారులోని అబ్దుల్లాపూర్‌మెట్, వట్టినాగులపల్లి, బొరంపేట్‌లో ప్రభుత్వం ఇసుక బజార్లను ఏర్పాటు చేసింది. దొడ్డు ఇసుక టన్నుకు రూ.1,600, సన్న ఇసుక టన్నుకు రూ.1,800గా ధరలు నిర్ణయించింది. మీ-సేవ కేంద్రాల్లో బుకింగ్ చార్జీలు, జీఎస్టీ, రవాణా ఖర్చులు కలిపి టన్నుకు రూ. 2,000-2,200 వరకు ఖర్చవుతున్నది. గోదావరి, కృష్ణా నదుల నుంచి ఇసుక రవాణా చేయాలని టీజీఎండీసీ నిర్దేశిస్తుండగా, లారీల నిర్వాహకులు మాత్రం చౌటుప్పల్ సమీపంలో మూసీ నుంచి ఇసుక తరలిస్తున్నారు. కొందరు లారీ యజమానులు ఇసుక అడ్డాలపై కాళేశ్వరం ఇసుక టన్నుకు రూ. 2,000 వరకు విక్రయిస్తుండగా, మట్టితో కూడిన మూసీ ఇసుకను ప్రభుత్వం ఇసుక బజార్లలో రూ. 2వేలకు పైగా విక్రయిస్తుండడం గమనార్హం. దీంతో ఇసుక బజార్లలోని ఇసుకకు డిమాండ్ లేకుండా పోయింది. బడా బిల్డర్లు నేరుగా టీజీఎండీసీకి డీడీలు చెల్లించి కాళేశ్వరం నుంచి ఇసుకను తరలిస్తుండగా, చిన్నచిన్న నిర్మాణదారులు ఇసుక అడ్డాల్లో అధిక ధరతో ఇసుకను కొనుగోలు చేస్తున్నారు. అక్రమాలను అరికట్టామని చెప్తున్న అధికారులు... ప్రజలకు మాత్రం అందుబాటు ధరలో నాణ్యమైన ఇసుకను అందించడంలో విఫలమైనట్టు సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# అడవి అలుసా? చట్టం తెలుసా?

మొదటిపేజీ తరువాయి...

సంపద, వన్యప్రాణుల ఆనవాళ్లపై అధ్యయనం చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో దాదాపు మూడు గంటల పాటు సమావేశమయ్యారు. 400 ఎకరాల భూములపై రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నివేదికను అధికారులు కమిటీకి సమర్పించారు. ప్రభుత్వం తరపున ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్, సైబరాబాద్ సీపీ అవినాష్ మోహంతి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, పీసీసీఎఫ్ డోబ్రియాల్, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు, టీజీఐఐసీ అధికారులు హాజరైనట్టు తెలిసింది.

**90 శాతం తుప్పలేనని నివేదిక..**

కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి సుప్రీంకోర్టు ఉత్తర్వులతో రాష్ట్ర ప్రభుత్వానికి సంక్రమించిందని, ఈ భూమితో హెచ్‌సీయూకు ఎలాంటి సంబంధం లేదని ఎంపవర్డ్ కమిటీకి ముఖ్యకార్యదర్శి నివేదించినట్టు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యం కింద ఉన్న ఈ భూములను అభివృద్ధి పనుల కోసం టీజీఐఐసీకి అప్పగించినట్టు నివేదికలో పొందుపరిచినట్టు తెలిసింది. ఆ భూముల్లో అడవి లేదని, భూమి వినియోగంలో లేకపోవడంతో మొక్కలు పెరిగాయని, త్వరితమైన పట్టణీకరణ వల్ల సిమెంటు వ్యర్థాలు, ఎక్కడెక్కడి నుంచో తెచ్చి పడేసిన బండరాళ్లు, చెత్తా చెదారం కలిసి గుబురుగా తయారైనట్టు నివేదికలో పేర్కొనట్టు సమాచారం. వన్యప్రాణులు లేవని, అసలు అది వన్యప్రాణులకు నివాసయోగ్యమైన ప్రాంతం కాదని నివేదించినట్టు తెలిసింది. తాము తొలగించిన చెట్లలో 90 శాతం తుప్పలు, మరో 10 శాతం సుబాబుల్, యూకలిప్టస్ చెట్లు మాత్రమేనని నివేదించినట్టు సమాచారం. ఈ తుప్పల్లో వన్యప్రాణులు ఏమీ లేవని, ప్రభుత్వమంటే గిట్టని ప్రతిపక్షాలు ఏఐ వీడియోలు సృష్టించి సోషల్ మీడియాలో వైరల్ చేశారని నివేదికలో పొందుపరిచినట్టు తెలిసింది.

**భయం గుప్పిట్లో అధికారులు**

అమూల్యమైన డీమ్డ్ ఫారెస్టును విధ్వంసం చేయటంలో ఫారెస్టు శాఖ నిర్లక్ష్యం, టీజీఐఐసీ తెంపరితనం ఉన్నదని కమిటీ అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. జింకలు చనిపోయినట్టు మీడియాలో చూశామని, అది వాస్తవమేనా? అని నిలదీసినట్టు తెలిసింది. 'అన్నింటినీ క్షుణ్ణంగా గమనిస్తున్నాం.. బాధ్యులపై కచ్చితంగా చర్యలుంటయి' అని హెచ్చరించినట్టు సమాచారం. ఒక దశలో 'మీపై క్రిమినల్ కేసులు తప్పవు' అంటూ హెచ్చరించడంతో ఫారెస్టు, టీజీఐఐసీ అధికారులు ఆందోళనతో ఉన్నట్టు తెలుస్తున్నది.

### భూమి యాజమాన్యం అప్రస్తుతం

**ప్రభుత్వ** నివేదికపై అభ్యంతరం వ్యక్తం చేసిన కమిటీ.. భూములు ఎవరి యాజమాన్యం కింద ఉన్నాయనేది అప్రస్తుతమని, అది డీమ్డ్ ఫారెస్టా? కాదా? అన్నదే ప్రధానమని స్పష్టం చేసినట్టు తెలిసింది. ఈ రాష్ట్రంలో ఫారెస్టు శాఖ పని చేస్తున్నదా? అనే సందేహం వ్యక్తం చేసినట్టు సమాచారం. అంత పెద్ద ఆవాసం విధ్వంసానికి వెళ్తున్నప్పుడు అక్కడ ఉన్న వృక్షజాలం ఎంత? జంతుజాలం ఏమిటి అనే మదింపు అవసరం లేదా? అని పీసీసీఎఫ్ అధికారిని నిలదీసినట్టు తెలిసింది. తక్కువ సంఖ్యలో చెట్లు ఉన్నాయని, పక్షులు, వన్యప్రాణులు లేవని మదింపు లేకుండా ఎలా నివేదిక తయారు చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. చెట్ల వయస్సు, జాతికి సంబంధించిన సమగ్ర నివేదిక తక్షణమే ఇవ్వాలని అడిగినట్టు తెలిసింది. గూగుల్ మ్యాపులు, ఫారెస్టు ఇన్వర్మేషన్ మేనేజ్మెంట్ సిస్టం(ఎఫ్ఐఎంఎస్)లను చూస్తే అక్కడ దట్టంగా విస్తరించిన పచ్చదనం కనిపిస్తున్నదని, తాము క్షేత్రంలో తిరిగినప్పుడు 20 నుంచి 40 సంవత్సరాల పైబడిన మొక్కలు, వాటి ఆనవాళ్లు గుర్తించామని చెప్తూ తప్పుడు సమాచారంతో తమను తప్పుదోవ పట్టించాలనుకోవడం క్రిమినల్ అఫెన్స్ అవుతుందని గట్టిగా నిలదీసినట్టు తెలిసింది. విద్యార్థుల కోరిక మేరకు మరోసారి పరిశీలనకు వస్తామని హామీ ఇచ్చినట్టు సమాచారం.



గురువారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో హెచ్‌సీయూ విద్యార్థులతో సమావేశమైన 'సుప్రీం కోర్టు' కమిటీ సభ్యుల బృందం

# ఆ భూములు ఎంతో ప్రత్యేకం!

## హెచ్‌సీయూ అడవిలో అరుదైన వృక్ష వైవిధ్యం • భిన్న జాతి మొక్కల పెరుగుదలకు అనువైన నేల

- 10 ప్రాంతాల్లో ప్లాంట్ సైన్స్ విభాగం ట్రీ సర్వే
- ఒక్క చదరపు కి.మీలోనే 26 జాతుల మొక్కలు
- వంద ఎకరాల్లో 78,914 చెట్లున్నట్టు గుర్తింపు
- 400 ఎకరాల్లోనూ వైవిధ్యం ఉన్నదన్న ప్రొఫెసర్లు
- అనుమతిస్తే సర్వే చేసి నిరూపిస్తామన్న విద్యార్థులు

హైదరాబాద్ సిటీ బ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): అరుదైన మొక్కల పెరుగుదల, వన్యప్రాణుల మనుగడకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిధి భూములు ఎంతో అనువైనవని తేలింది. యూనివర్సిటీలోని ప్రొఫెసర్ ఎస్ సిద్ధార్థన్ ఆధ్వర్యంలో ప్లాంట్ సైన్స్ ప్రొఫెసర్లు, ఎకాలజీ రిసెర్చ్ ప్రొఫెసర్, ఎకాలజీ స్కాలర్స్, 30 మంది ప్లాంట్ సైన్స్ స్కాలర్స్ యూనివర్సిటీలోని సౌత్ క్యాంపస్ అటవీ ప్రాంతంలో సర్వే చేశారు. ఈ సర్వేలో గ్రేటర్ హైదరాబాద్‌లోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే హెచ్‌సీయూ భూములు ప్రత్యేకమైనవని స్పష్టమైంది. అరుదైన అటవీ వృక్షాల మనుగడకు ఈ భూములు అనుకూలమైనవని వెల్లడైంది. అక్కడ అడవే లేదు.. జంతువులే లేవు.. జీవవైవిధ్యం లేదంటున్న సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న వ్యాఖ్యలు ఉత్త మాటలేనని తేటతెల్లమైంది. సర్వే బృందం సౌత్ క్యాంపస్‌లోని 10 ప్రాంతాలను ఎంచుకొని అక్కడి మొక్కలు, వాటి ఎగుదల, లక్షణాలపై అధ్యయనం చేసింది. ఒక్కో ప్రాంతంలో 10 చదరపు మీటర్ల ప్రాంతాన్ని ఎంపిక చేసి అక్కడి చెట్ల ఎత్తు, వెడల్పును లెక్కించారు. అక్కడున్న ఒక్కో చెట్టు దాదాపు 33 సెంటీమీటర్ల వెడల్పు కలిగి ఉన్నట్టు గుర